# నిష్క్రమణ

తొమ్మిదేళ్ళ గోపిగాడు పన్నెండుమైళ్ళు నడిచి ఎలాగో విజయవాడ సరిహద్దుల్ని అందుకునేటప్పటికి వాడి తాతలు దిగొచ్చారు. వెధవమోడు పన్నెండుమైళ్ళు ఏకబిగువున నడుచుకొచ్చాడు. వెనకాల వాళ్ళన్న పరుగెత్తుకొస్తాడేమోనని... ఒక మైలుదూరం - రోడ్డుకు ఎడంగా - పొలాల కడ్డంబడి... చావు తెంపులతో విజయవాడ వేపుకు ఉరుకు లంకించుకున్నాడు. ఎలాగయితేనేం... ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరిన గోపిగాడు సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ సరిహద్దుల్ని అందుకోగలిగాడు.

ఒకవేపున మొగల్రాజపురం కొండా, ప్రక్కనే తోటలూ, మరోవేపున - కాలేజీ భవనాలూ - ప్రక్కన నిండుగా ప్రవహించే కాలవా, ఇవన్నీ గోపిగాణ్ణి ఆశ్చర్య సంభ్రమాల్లో ముంచెత్తినాయి. ఎన్నాళ్ళనుంచో అటు ఏలూరుగాని ఇటు బెజవాడగాని పారిపోవాలని అనుకుంటున్నాడు... అలాంటి అవకాశం ఈరోజుకు సంప్రాప్తించింది.

గోపీ కాలేజీ భవనాల కెదురుగా - రోడ్డుమీద నిలుచున్నాడు. ఇదంతా వాడికి కొత్త ప్రపంచంలా వుంది. పన్నెండుమైళ్ళు నడిచిన బడలికగానీ, ఇంటినుంచి అన్నకు చెప్పకుండా పారిపోయాననే చింతగానీ - ఈ నిమిషంలో వాడిలోలేదు. తనకు విముక్తి లభించింది. ఈరోజుతో వాడి బాధలు అంతమయ్యాయి. ఇక వాడికి స్వేచ్ఛ. తను వెళ్ళ

దలుచుకున్న చోటికి నిరాటంకంగా వెళ్ళొచ్చు. తనమీద మరెవరి అధికారమూలేదు... ఇవి వాడి సంతోషకారణాలు.

నలువేపులా పరికిస్తూ... ఏవేవో ఆలోచిస్తూ... గోపీ ముందుకు సాగినప్పుడు - వాడికి అకస్మాత్తుగా ... తన శరీరం... నుజ్జు నుజ్జు అయినట్లూ అతి ఆకలిగానూ దప్పిగానూ వున్నట్లు తెలీడంతో జేబు తడుముకున్నాడు. రెండణాలు చేతికి తగిలాయి... ఏదో ఆశ చిగిర్చింది. తన ఆకలి తీర్చుకో గలనని సంతోషపడ్డాడు. కాని మరుక్షణంలో - ఆ రెండణాల వెనక ఇమిడివున్నగాధ వాణ్ణి నిరాశపరిచింది. ఆకలిచేత కాళ్లు తేలిపోతున్నాయి... వాడికళ్ళముందు సీతాకోకచిలకల్లాంటివేవో అగుపిస్తున్నాయి. మరుక్షణంలోనే... వాళ్ళఅన్న, వాడి వదిన, ఆవిడ కొడుకూ స్పష్టంగా కన్పించారు.

♦ ♦ ♦ ♦ ♦

ఉదయం ఎనిమిది గంటలు. పదినెలల పాపాయిని... ఆడించి నిద్రబుచ్చి వదిన కందించాడు. ఆ తరువాత - అన్నం పెట్టమని అడగ్గా - "పనీలేదూ, పాటూలేదు; సేరుబియ్యాం మాత్రం గావాలి. కాస్త పొద్దెక్కనియ్. అందాకా మీఅన్నకు సాయపడు" అని గదమాయించింది - గోపీ వదిన!

నెమ్మదిగా చావిట్లోకి వెళ్ళి గోడపక్కన నిలుచొని వుండగా - గోపిగాడి అన్న బిగ్గరగా 'ఎక్కడ చచ్చావురా? ఇట్లా వచ్చి కాస్త ఈ పని చూడు!' అని కేక వేశాడు.

ఆ పనీ ఈ పనీ చెబుతూ మధ్య మధ్యలో నోటి కొచ్చినట్లు తిడుతూ, గదమాయిస్తూ - ఒకటి రెండు దఫాలు కొట్టి - అరగంటవరకు పనిచేయించుకున్నాక - కోమటింటికి

రెండణాలిచ్చి— బీడీలు తెమ్మని పంపించాడు - గోపిగాడి అన్న !

ఇటు అన్నచేతా, అటు వదినచేతా తిట్లూ తన్నులూ తింటానికి అలవాటు పడ్డ గోపిగాడి కివేవీ కొత్తకాదు. రోజూ బీడీలు తెమ్మని పంపించటం - ఆ పేరుతో బయటి కొచ్చి కాసేపు అటూ ఇటూ తిరిగి,బీడీలు తీసుకెళ్ళటం, ఆలస్యానికి దెబ్బలు తింటం— ఇవన్నీ రోజూ జరిగే కార్యక్రమాలే !

అయితే తొమ్మిదేళ్ళ గోపిగాడి హృదయంలో మొట్టమొదటిసారిగా ఈ రోజు తనఅన్నమీద తిరుగుబాటు భావం ఉద్భవించుకొచ్చింది దాంతో తనకు తెలీని తల్లీ తండ్రీ స్మృతిపథంలోకి వచ్చారు - అమాంతంగా ! ఏదో తెలీని బాధ, ఏదో కోపం, ఏదో విరక్తి... భావాలు వాడి హృదయాన్ని ఆవరించగా - బీడీలకై యిచ్చిన రెండణాలుతీసుకొని తన ముందుగా దుమ్ము రేపుకుంటూ ఏలూరునుంచి బెజవాడకు వెళ్ళే బస్సునుచూచి - పొలాల కడ్డంగాబడి... పొట్టిపాడు నుంచి పారిపోయాడు - గోపిగాడు !

◆ ◆ ◆ ◆ ◆ ◆

చింతచెట్టుకింద కూచున్న గోపిగాడు లేచి నిలుచున్నాడు. నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ ఏలూరు రోడ్డుమీద - ముందుకు సాగిపోయాడు ! కొంచెం దూరం నడిచాక... వాడి కేదో దుకాణం కన్పించింది. ఆ రెండణాలతో ఏదో కొని తినేశాడు. రోడ్డు పక్కనున్న పంపులో నుంచి తాగగలిగినన్ని నీళ్లు తాగేప్పటికి వాడికి కాస్త హుషారు కలిగింది; ఏదో మరల జిజ్ఞాసాప్రవృత్తికి లోనై -

విజయవాడ నగరంలోకి ఒక్కొక్క అడుగు వేస్తున్నాడు. ఇలాంటి వాతావరణంలోకి వాడు రావటం ఇదే ప్రథమం కావటాన కాస్త కంగారుపడుతున్నాడు. ఆ కంగారు వెనక ఏదో సంతృప్తి - ఏదో ఆనందం - వాడిలో దోబూచులాడుతునై్న.

తను లోనికి చొచ్చుకపోతున్నకొద్దీ రిక్షాలూ జట్కాలూ కార్లూ, వచ్చే పొయ్యేజనం - అధికంగా వున్నవి. వాడు నడుస్తూనే వున్నాడు.

'జవ్హార్ టాకీస్' సమీపాన కాస్తలో వాడు కారు క్రిందబడి ఈపాటికి అంతిమశ్వాసవదలి వుండాల్సింది. డ్రైవర్ కారాపి రెండు చెంపదెబ్బలతో గోపిగాణ్ని వదిలేశాడు. కారు బయలుదేరి పోయాక గుడ్డలదుమ్ము దులుపుకొని చెంప సవరించుకుంటూండగా రిక్షావాళ్లూ, జట్కావాళ్లూ, సమీపంలోని దుకాణాలవాళ్లూ గోపిగాడిచుట్టూ గుమిగూడి

'ఎవడవురా నువ్వూ. కాస్తలో గయామార్ అయే వాడివే.'

'కళ్లు నెత్తిన పెట్టుకొని నడుస్తున్నావల్లేవుంది; కాస్త బజారెంక చూచి నడవ్వోయ్!'

"ఒరేయ్! ఏ పేటరా నీది? ఆ కారెవరిదో నీకు తెలీదటరా? ఏదో డ్రైవరు కనికరించాడు- లేకపోతే నువ్వు పిసరు పిసరు అయినా ఆయనకు లెక్కలేదు."

"నాలుగు తన్నండిరా, మాటా పలుకూలేదే!" అని తలొకమాట అనసాగారు. గోపిగాడు అదిరిపోయాడు-నిజంగా వీళ్ళంతా కలిసి తన్ను తంతారేమోనని బెంబేలుపడి అన్నాడు

"పొట్టిపాడు రాగవులు తమ్ముణ్ణి నేను. మా అన్న కమ్మరి పనిచేస్తాడు."

ఎవరో సమూహంలోంచి తోసుకొచ్చి అన్నాడు "ఈ కుర్రాడు మీలాంటిమనిషి కాదూ. ఏదో చిన్నతనంవల్ల కారుముందు కొచ్చినందుకు ఇన్నిమాటలనాలా? ఆ కారులో కూర్చున్నవ్యక్తి- విజయవాడలో పేరెన్నికగాంచిన వ్యాపారి అనీ, విజయవాడ ప్రతిపౌరుడూ ఆయనకు వంగి నమస్కరిస్తాడనీ- వాడికేం తెలుసు? మీరంతా వాడు ఆకారుక్రిందపడి చచ్చిపోలేదని విచారిస్తున్నట్లున్నది."

ఆ తరువాత ఎటువాళ్లు అటువెళ్ళిపోయారు. అప్పుడాయన గోపిగాడితో కాస్త జాగ్రత్తగాచూచి నడవమని చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ ఘటనతో వాడు కంగారుపడ్డాడు. అడుగులో అడుగేసుకుంటూ ముందుకు నడిచాడు. ముందుకు నడిచిన కొద్దీ జన సమర్దం జాస్తిగావుంది. రిక్షాలూ, జట్కాలూ, కార్లూ జోరుగా తిరుగుతున్నాయి. పోలీసు సెంటర్‌లో నిల్చుని...దారి చూపిస్తున్నాడు. గోపిగాడు చాలా జాగ్రత్తగా ముందుకు నడిచివెళ్ళాడు. 'లక్ష్మీటాకీస్" ముందు వేలాడగట్టిన సినిమాబొమ్మల్ని తదేకంగాచూచి మరల ముందుకుసాగాడు.

సాయంత్రం ఆరుగంటలయింది. గవర్నర్‌పేటంతా తిరిగి గోపాలరెడ్డిరోడ్డునేబడి 'అన్సారీపార్కు' కొచ్చి- సిమెంట్‌బల్లమీద చతికిలబట్టంతోటే- వాడి కడుపులోనుంచి ఆకలి మంటలు ఒక్కసారిగా పైకెగసినాయి. పొట్టచూచు

కున్నాడు. ఆకలి చూపులతో నలువేపులా కలియజూచాడు. సిగరెట్లుతాగుతూ లోకాభిరామాయణం చెప్పుకుంటున్న వాళ్ళూ, రాజకీయాలమీద సంఘర్షణ పడుతున్నవాళ్లూ, సినిమాలమీద చర్చలు సాగిస్తున్నవాళ్లూ గోపిగాడికి కనిపించారు. ఆకలి దహించుకపోతోంది పార్కు-మూలనున్న మునిసిపాలిటీపంపుదగ్గర కెళ్ళి కడుపునిండా నీళ్లునింపేశాడు, తాత్కాలిక ఉపశమనానికి. సంతృప్తిపడి మరల అటూఇటూ చూసేప్పటికి - సమీపంలో తన వయస్సులోనేవున్న ఇద్దరు ముగ్గురుకుర్రాళ్ళను చూచాడు. మురికిబట్టలూ, లోతుకుపోయినకళ్ళూ, సంస్కారం లేని జుట్లూ-ఇవీ వాళ్ళఆకారాలు. తన ముందుగానే వాళ్ళుపార్కులోకి వెళ్లారు. గోపిగాడు ఎందుకో వాళ్ళను అనుగమించాడు! వాళ్ళు ముగ్గురూ ఎవరిదారిన వాళ్ళు చీలి.. ప్రతివ్యక్తిదగ్గరికీ వెళ్ళి "బాబూ! ఒక కానీ ఇప్పించండి...ఆకలేస్తున్నది; పొద్దుటినుంచీ ఏమీ తినలేదు'- అని ప్రార్థిస్తున్నారు. కొందరు వీళ్ళ ప్రార్థనల్ని ఖాతరయినా చేయటంలేదు. మరికొందరు...విసుక్కుంటూనే జేబులో ఏదో తీసి ఇస్తున్నారు!... మరికొందరు-"వెధవా! పదేళ్లు ముడ్డికింద కొచ్చాయి - ముష్టెత్తుకోకపోతే - కార్లస్టేండ్ దగ్గరకో - రైలుస్టేషను దగ్గరకో వెళ్ళి కూలిచేసుకోరాదూ! ఛో! ఛో!" అని గదమాయిస్తున్నారు.

గోపిగాడికిదంతా "నేనూ ఉదయంనుంచీ ఆకలితోనే వున్నాను! ఈ నిమిషంలో ఎవరైనా ఒక కానీ యిస్తే... ఏదో కొనుక్కొని తినొచ్చు!... ఈ కుర్రాళ్లుకూడా నాలాగానే ఇంటిదగ్గర్నుంచి పారిపోయివచ్చారేమో! నాలాగానే

వాళ్ళూ నానా యాతనలకు గురై వుంటారు!... వాళ్ళలాగా నేనూ ఒక్క కానీకోసం... మనుషుల్ని ప్రార్థిస్తే బావుంటుం దేమో. ఈ కాలేకడుపుమంట చల్లార్చుకునేందుకు అదొక్కటే మార్గం!" అని ఆలోచించుకొని గోపిగాడు సమీపంలో వున్న ఇద్దరు వ్యక్తుల దగ్గర కెళ్ళి ... 'బాబూ! ఒక కానీ ఇప్పించండి. ఆకలేస్తున్నది! ఉదయంనుంచీ ఏమీ తినలేదు బాబూ!' అని ప్రార్థించటంతోనే ఒకాయన ఉగ్రుడై లేచి నిల్చొని 'వెధవముండాకొడుకుల్లారా, మీ అందరిదీ వేషం! ... గూటంలా వున్నావు...కూలిచేసుకోరాదూ! మీ లాంటివాళ్లుండబట్టే దేశం ఇలావుంది... వెళ్ళు! వెధవా! వెళ్లు!!' అని కొట్టబోయాడు. గోపిగాడు గజగజా వణికి పోతున్నాడు. గబగబా పార్కుబయటికొచ్చాడు.

ఇలాంటి పరిస్థితుల్లోకూడా వాడు ఇంటినిగూర్చి ఆలోచించలేదు. తన అన్నగాని, వదినగాని వాడి స్మృతి పథంలో మెదల్లేదు. ఆకలితో బాధపడుతున్నా... దీంట్లోనే వాడికేదో తృప్తికన్పించినట్లుంది. లేకపోతే ఈపాటికి నడిరోడ్డు మీద నిలబడి అన్నకోసం - గావుకుమని ఏడ్చివుండేవాడు.

రోడ్డుమీద నడుస్తున్న ఒక వ్యక్తిని ఆపి బస్టేండ్‌కు దారిఅడిగి తెలుసుకున్నాడు. అక్కడికెళ్ళి చూచేటప్పటికి వాడికళ్ళు తిరిగిపోయాయి. రకరకాల బస్సులు వరసగా నిల బడి వున్నాయి. జనంలోసందు లేదు. కూలిదొరుకుతుందనే ఆశ వాడిలోకలిగి... అప్పుడే స్టేండుకువచ్చిన ఒక బస్సుదగ్గరికి పరుగెత్తాడు. ఈవృత్తి వాడికి కొత్తదేఅయినా ఉదయంనుంచీ తనను వేధిస్తూన్న ఆకలిబాధను తీర్చుకునేందుకు- బస్సుదగ్గర

కెళ్ళి - 'కూలి బాబు, కూలివున్నదా' అని జంకుజంకుగా-హీన స్వరంతో కేకేశాడు. తన వయస్సులోనేవున్న మరికొంత మంది కుర్రాళ్లు గబగబా బస్సెక్కి - బరువుల్ని దించు తున్నారు. దించి బేరాలాడుతున్నారు. జంకూ గొంకూ లేకుండా తెగేసి మాట్లాడుతున్నారు. ఒక్క కుర్రాడు - "కూలి బాబు కూలి" అని కేకేస్తూంటే గోపిగాడివేపు కళ్ళు మిటకరించి చూచాడు. ఎందుకో గోపీగాడికి భయమనిపించింది. ఇంకో కారుదగ్గర కెళ్ళాడు. "కూలి బాబు కూలీ" అన్నాడు. ఎవరోపిలిచి "ఇదిగో ఈ సూట్ కేస్ ఎత్తుకో; కృష్ణలంక వెళ్ళాలి" అన్నారు. గబగబా వెళ్ళి ఆ పెట్టె నెత్తినెట్టు కున్నాడు. ఆయన ముందూ - వీడు వెనకా...నడుస్తున్నారు. గోపిగాడు ఆలోచిస్తున్నాడు...

"కూలి పావలా అయినా గిడుతుంది. దాంతో ఈరోజు హాయిగా కొనుక్కు తింటాను! రేపటి సంగతి రేపు!... అడుక్కోవటం కంటే ఇదే బావున్నది! రోజల్లా పనిచేస్తే రూపాయీ, రూపాయిన్నర గిడుతుంది. నా యిష్టంవచ్చినట్లు తింటాను - తిరుగుతాను..."

ఇంతలోకే ముందు నడుస్తున్నాయన - 'తొరగా నడ వరా!' అని కేకేశాడు. ఒక్కో అడుగేస్తున్నకొద్దీ నెత్తిమీద పెట్టె బరువెక్కుతోంది. కాళ్ళు పట్టుతప్పుతున్నాయి ఎంత సేపటికి క్రిష్ణలంక రావటంలేదు. ఇప్పుడే రామమోహన గ్రంథాలయ సమీపానికి చేరుకున్నారు. అక్కడ రోడ్డుదాటు తూన్న సమయానికి - అటు వేపునుంచి ఒక కారు వేగంగా రావటం, దాన్ని తప్పుకోబోయి - గోపిగాడు వెల్లకిలా పడటం

జరిగేటప్పటికి - ముందు నడుస్తున్న వ్యక్తి - 'ఏమిట్రా వెధవ కుక్కల కొడకా!' అంటూ వెనక్కు వచ్చాడు. సూట్‌కేస్ కిందపడి దెబ్బతిన్నది. దాన్ని చూచి ఆయన గోపిగాణ్ని ఇష్టం వచ్చినట్లు తిడుతున్నాడు. గోపిగాడి మోకాళ్ళనుంచీ, నోటినుంచీ రక్తం కారటాన్ని చూచికూడా ఆయన తనపెట్టె పాడయిపోయినందుకు నానాతిట్లు తిట్టి 'వెధవా! పో! నా కొత్తసూట్‌కేస్ కాస్తా నాశనంచేశావ్! నువ్వు నాకక్కర్లేదు! వెళ్లు.' అన్నాడు.

నలిగిన పెదాలనుంచి కారుతూన్న రక్తాన్ని చొక్కాతో తుడుచుకుంటూ - మారు మాటాడకుండా వెనక్కితిరిగి వెళ్ళిపోయాడు.

మరల అన్సారీపార్కు! పార్కుమూల నీటిపంపు దగ్గర గోపిగాడు ప్రత్యక్షం! ఆరుగంటలు దాటింది. అన్నిచోట్లా లైట్లు వెలిగాయి. అంతటా వెలుతురు వ్యాపించింది. గోపిగాడి హృదయంలో కటిక చీకట్లు కదం తొక్కుతున్నాయి. ఆకలి దహించుకుపోతోంది. ఏం చేయటానికీ తోచలేదు. ఇక ముందుకునడిచేఓపికకూడా వాడిలో అంతరించిపోయింది. పార్కుపక్కనేవున్న ఒక ఇంటిబయటి అరుగుమీద కూచోబడ్డాడు. కాసేపటికి- ఆ రాతి అరుగుకు అప్పగించాడు - దహించుకుపోతూన్న తన శరీరాన్ని.

◆ ◆ ◆ ◆ ◆

తెల్లవారింది. మృతప్రాయుడుగా పడివున్న గోపిగాణ్ణి ఆ ఇంటివాళ్లు తలుపులు తెరుచుకొని బయటికొచ్చి నాలుగు

తిట్టాక... సజీవుడికి మల్లే - కాళ్ళూ చేతులూ కదిపి ... ఎలాగో లేచి తనశరీరాన్ని గోడకు ఆనవేశాడు ! ఐదునిమిషాల అనంతరంగాని గోపిగాడు పూర్తిగా జాగ్రదావస్థను అందుకోలేదు! అలా మామూలు స్థితికి చేరుకోవటంతోటే - వాడిలో రాత్రినుంచీ వాడిలాగానే నిద్రించిన ఆకలి...ఒక్కసారిగా మేల్కొని వాడిమీద తిరగబడింది. నరకంకాళం ప్రాణం పోసుకున్నది. సామాన్యమానవుని జీవిత విధానం మీద... ఈ నరకంకాళం ఏదో ఒక సత్యాన్ని అవగతం చేసుకున్నది! అందుకే గోపిగాడి మెదడు - ఈవిధంగా ఆలోచిస్తున్నది. 'నాలాగా ఆకలిచేత పొట్టచేతపట్టుకొని... నగరం చుట్టూరా తిరిగే కుర్రాళ్లు ఇంతకాలం ఎలా బతికేరు ! తెల్లబట్టలేసుకొని సినిమాల్ని గూర్చి పత్రిక విషయాల్ని గూర్చి-వాదించుకునే ఈ వ్యక్తులంతా నాలాంటి వాళ్ళను పురుగులాగా చూస్తారు దేనికి ?'

అడుగులో అడుగేసుకుంటూ గోపిగాడు - గవర్నర్‌పేట సెంటర్ దాకా దేకేడు ! అక్కడ - ప్రతిఒక్కరూ హడావిడిగా వున్నారు. హైద్రాబాద్ సేఠ్‌లూ, కృష్ణాజిల్లా కమ్మవారూ- షాపులు తెరచుకొని తాపీగా రోడ్డువేపు చూస్తూ కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ - జీబురు జుట్టు గోపిగాళ్ళూ - కన్పించినప్పుడల్లా... మొహం చిట్లించుకొని - 'అప్పుడే తెల్లవారిందటరా, వెధవల్లారా !' అని- 'బాబూ ! ఒక కానీ ధర్మం ఇప్పించండి' అని ప్రాధేయపడుతున్నవాళ్ళకు సమాధానం చెబుతున్నారు.

ఈ షావుకార్లూ, ఈ రక రకాల వ్యాపారస్తులూ - తరాలనుంచి... గోపిగాడి తాత ముత్తాతల్ని ... ఆకలిబాధ లకు లోనుజేస్తూ పీడిస్తూ - వస్తున్నారనీ, ఈ సామాజిక వ్యవ స్థలోని అవ్యవస్థతకు కారకులు ఏరేననీ - గోపిగాడి చిన్న మెదడుకు అవగతం కాలేదు.

కాళ్లు విరిగిన కుక్కలాగా దేక్కుంటూ - ఆకల్ని ఆపు కోలేక ... హోటల్‌వాళ్లు బయటపడేసిన ఆకుల్లో ఏదైనా దొరకవచ్చుననే ఉద్దేశ్యంతో ... గవర్నర్‌పేట సెంటర్‌లో ఒక వేపునుంచి మరోవేపుకు తొరగా నడుస్తున్న సమయా నికే...వాడిమీది నుంచి ఒక కారు వెళ్ళిపోవటం - గోపిగాడు నెత్తురుముద్దగా...రోడ్డుమధ్య పడిపోవటం చాలా స్వల్ప సమయంలోనే జరిగిపోయింది.

చుట్టూరా జనం మూగేరు. నెత్తురుముద్ద...మూల్గు తోంది. అస్పష్టంగా ఇలా అన్నది... "నన్ను మీరు కొట్టకండి...నేను తెలీక కారుకిందకొచ్చాను....నేను పొట్టి పాడు రాగవులు తమ్ముణ్ణి! మా అన్న కమ్మరిపని చేస్తు న్నాడు...నన్ను మీరు కొట్టవద్దు...నేను పొట్టిపాడు వెళ్తాను!...మా అన్నా వదినా...తిట్టినా కొట్టినా అక్కడే వుంటాను...నేను వెళ్ళిపోతాను...నన్ను వెళ్ళనీయండి..."

మరల కాసేపటికి గోపిగాడు జీవం మంచినీళ్ళకోసం ప్రార్థించింది...నోరు చూపిస్తూ! మరికొన్ని నిమిషాలకు -

తొమ్మిది సంవత్సరాల గోపిగాడు ఈ ప్రపంచంనుంచే నిష్క్రమించాడు! వాడి చుట్టూరా నిలుచున్న హైదరాబాదు సేఠ్‌లూ, కృష్ణాజిల్లా కమ్మవారూ, హోటల్ మేనేజర్లూ ...వాడిదహన సంస్కార ఏర్పాట్లను గూర్చి చర్చించుకుంటున్నారు... ఇంతలోకే జనాన్ని తోసుకుంటూ ఎవరో గోపిగాడి శవందాకా వచ్చి- విషణ్ణహృదయంతో అన్నాడు- 'బీదవాడు బ్రతికివున్నంతకాలమూ మీరేమీ చేయరు! చనిపోవటంతోటే...వాడి దహనసంస్కారాల కోసం మాత్రం చందాలు వేసుకొని బయటివాళ్ళకు- మీ 'దయను' ప్రదర్శిస్తున్నారు!...వీడి నిష్క్రమణ వృధాపోదు!...రోజు రోజుకూ బాధకులోనవుతూ...ఆకలికి అలమటిస్తూ జీవనయాత్రను జరిపే అసంఖ్య ప్రజానీక హృదయంలో...వాడు మరల జీవించి వాళ్ళకు కర్తవ్యాన్ని బోధిస్తాడు. బీదల వ్యధల గాధలను భరతవాక్యం పాడిస్తారు.'—

# కథావాహిని 12

## పోతుకూచి సాంబశివరావు కథలు